క్లుప్తంగా

నేడు బురడగుంట గంగమ్మ జాతర


విశేషాలంకారంలో అమ్మవారు

పుంగనూరు: మండలంలోని కుమ్మరగుంట గ్రామంలో ఆదివారం శ్రీబురడగుంట గంగమ్మ జాతర జరుగనుంది. శనివారం ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. ఆదివారం భక్తులు దీపాలు మోసి, మొక్కుబడులు చెల్లించనున్నారు. నడివీధి గంగమ్మను పురవీధులలో ఊరేగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఉత్తమ సేవలకు నగదు పురస్కారం


బహుమతి అందుకుంటున్న ఉద్యోగులు

పుంగనూరు: స్థానిక ఆర్టీసీ డిపోలో అత్యుత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు నగదు బహుమతులను డీఎం సుధాకరయ్య అందజేశారు. శనివారం డిపో కార్యాలయంలో డ్రైవర్లు, కండక్టర్లు అన్వర్‌బాషా, రెడ్డెప్ప, జనార్దన్, పార్వతమ్మకు బహుమతులు ప్రదానం చేశారు. వీరు ఇంధనం పొదుపుతో పాటు వివిధ రకాలుగా అత్యుత్తమ సేవలు అందించినందుకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లను ప్రేరేపిస్తే కఠిన చర్యలు


రాఘవరెడ్డి, సీఐ

పుంగనూరు: ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రసంగాల వీడియోలు పెట్టినా, మెసెజ్‌లు పెట్టిన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రాఘవరెడ్డి హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ మణికంఠ చందవోలు ఆదేశాల మేరకు వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా గ్రూపులపై నిఘా పెట్టామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా మెసెజీలు, ప్రసంగాలు పూర్తిగా నిషేధమని తెలిపారు. ఇలాంటి వాటిలో మెసెజ్‌లు పెట్టిన వారితో పాటు గ్రూపు అడ్మిన్లపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా శాంతియుత జీవనానికి సహకరించాలని కోరారు.

రామోజీ మృతి తెలుగుభాషకు తీరని లోటు

పలమనేరు: ఈనాడు సంస్థల అధినేత, పద్మవిభూషణ్ రామోజీరావు మరణం తెలుగుభాష, సాహిత్యాలకు తీరని లోటని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తుల సీనాథం నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తన పత్రిక ద్వారా తెలుగుభాష పరిరక్షణకు ఆయన చేసిన కృషిని మరువలేమన్నారు. తెలుగుభాష రక్షణకు కృషిచేయడమే నేటి సమాజం ఆయనికిచ్చే నివాళిని తెలిపారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కంటి రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి చెన్నై శంకర్‌నేత్రాలయ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కంటి జబ్బు రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్ విగ్రహం మాయం



రామచంద్రాపురం: మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో వైఎస్సార్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గంగిరెడ్డిపల్లి ప్రధాన రహదారి తోకగుట్ట ఇండ్లు సమీపంలో ఎన్నో ఏళ్ల కిందట దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి 11 గంటల వరకు కూడా విగ్రహం అక్కడే ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. జనసమర్థంలో ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని ఎత్తుకెళ్లడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన సేవలు..పెరుగుతున్న ఓపీలు

పలమనేరు పట్టణంలోని ప్రభుత్వ హోమియో ఆస్పత్రి రోగులకు సంతృప్తికర సేవలను అందిస్తోంది. కొత్త హంగులతో సిద్ధమైన ఆస్పత్రి భవనంలో సేవలు పెరగడంతో గతంలో ఓపీ సగటున 40గా ఉండగా ఇప్పుడు 60 నుంచి 70కి చేరింది. ఆస్పత్రిని ప్రభుత్వం ఇటీవల అప్‌గ్రేడ్ చేసి నిధులను విడుదల చేయడంతో రోగులకు అవసరమైన సౌకర్యాలు సమకూరాయి.

- రోగులకు అందుబాటులో హోమియో ఆస్పత్రి
- సరికొత్త హంగులు..అన్ని వ్యాధులకు మందులు
- త్వరలో యోగా సేవలు అందుబాటులోకి..


ఆధునిక హంగులతో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ హోమియో వైద్యశాల

పలమనేరు: జిల్లాలో చిత్తూరు, పలమనేరుల్లో మాత్రమే హోమియో ఆస్పత్రులున్నాయి. ఇటీవల నామ్(నేషనల్ ఆయుష్ మిషన్), రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ ఆస్పత్రిలో సౌకర్యాలను మెరుగుపరిచారు. రోగులకు ఆర్వో వాటర్, ప్రత్యేక మూత్రశాలలు, అన్ని వ్యాధులకు అవసరమైన మందులు, రోజువారీ కార్యక్రమాల నిక్షిప్తం కోసం ల్యాప్‌టాప్ తదితరాలను అందజేశారు. ముఖ్యంగా శిథిలావస్థకు చేరిన ఆస్పత్రి భవనాన్ని మరమ్మతులు చేసి సరికొత్త హంగులు సమకూర్చారు. ఆస్పత్రి నిర్వహణకు సంబంధించి గతంలో ఏడాదికి రూ.30వేలుగా ఉన్న బడ్జెట్‌ను ఇప్పుడు రూ.1.5లక్షలకు పెంచారు. ఆస్పత్రి బయట హెర్బల్ గార్డెన్ సైతం పెంచారు.

నిత్యం 70మందికి మందులు

గతంలో ఈ ఆస్పత్రికి నిత్యం 40మంది వరకు రోగులు వస్తుండేవారు. ప్రస్తుతం 70 మందికి పైగా ఓపీ ఉంటోంది. మెరుగైన సేవలు అందుతుండడంతో వందకు పైగా ఓపీ పెరగవచ్చని ఆస్పత్రి వైద్యాధికారులు మోహన్‌కృష్ణ, మాధవిలత తెలిపారు. త్వరలో ఇద్దరు యోగా సహాయకుల సేవలు కూడా అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు.సెలవు దినమైన ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట, ఆపై 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. హోమియో వైద్యం రోగులకు ప్రభుత్వం ద్వారా పూర్తి ఉచితంగా అందుబాటులోకి వచ్చిందని పట్టణ ప్రజలు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

నేటి నుంచి మహాభారత యజ్ఞం


ఆలయంలో ప్రత్యేకాలంకరణలో ద్రౌపదీదేవి, పాండవుల విగ్రహాలు

యాదమరి(బంగారుపాళ్యం): యాదమరి మండలం చెన్నారెడ్డి పల్లెలో వెలసిన ద్రౌపదీ ధర్మరాజుల ఆలయంలో మహాభారత యజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో వెలసిన ద్రౌపతి ధర్మరాజులకు శనివారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు చేశారు. పాండవుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి ధ్వజారోహణం వద్ద కొలువు దీర్చనున్నట్లు వివరించారు. అర్చక వేదపండితులచే మహాభారత యజ్ఞంకు ధ్వజారోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. అనంతరం ఈ నెల 26వ తేదీ వరకు ప్రతి రోజు మధ్యాహ్నం ఆయలం వద్ద మదనపల్లెకు చెందిన గానకోకిల హరికథ విశారద టీటీడీ ఆర్టిస్ట్ హేమావతిచే హరికథ కాలక్షేపం నిర్వహిస్తున్నటు వివరించారు. రాత్రి నాటకాలు ఈ నెల 17 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తిరుచ్చిపై శ్రీవారి కటాక్షం


తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువు దీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయానికి చేరుకున్న స్వామి అమ్మవార్లకు మంగళహారతులిచ్చి పవళింపు సేవ నిర్వహించారు.

చెరువు కాదు.. రహదారే


పలమనేరు సమీపంలోని నాగమంగళం వద్ద హైవేలో నిలిచిన వరదనీరు

పలమనేరు: నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యం ఆమార్గంలో ప్రయాణించే వాహన చోదకులకు శాపంగా మారింది. రోడ్డును నిర్మించే సమయంలో సాంకేతికంగా ఆలోచించకుండా ఇష్టానుసారంగా పల్లంలో రోడ్డును నిర్మించి ఇప్పుడు ఏమీ చేయలేని స్థితిలోకి మార్చారు. వివరాలిలా..పలమనేరు సమీపంలో బెంగళూరు-చెన్నై హైవేకి గతంలో బైపాస్ నిర్మించారు. ఈ సందర్భంగా పట్టణ సమీపంలోని నాగమంగళం వద్ద పలమనేరు-బెంగళూరు బైపాస్ మార్గాన్ని నిర్మించారు. అయితే ఈ రోడ్డు పల్లంలో ఉంది. వర్షం పడినప్పుడు వరద నీరు అక్కడి నుంచి బయటకు వెళ్లేందుకు మార్గాన్ని ఏర్పాటు చేయకుండా రోడ్డు వేశారు. దీంతో వరదనీరు వెళ్లేందుకు మార్గం లేక వందమీటర్ల మేర రోడ్డు చెరువులా మారుతోంది. ఈవిషయం తెలియని వాహనాల డ్రైవర్లు నీటిలో దిగి ఇబ్బందులు పడుతున్నారు. బైక్‌లపై వెళ్లే వారు అంచనాలేక నీటిలో మునిగిపోయేదాకా వెళ్లి ప్రమాదాలబారిన పడుతున్నారు. తెలిసిన వారు మాత్రం ఈ మార్గం గుండా కాకుండా పక్కనే ఫ్లైఓవర్‌పైకి వెళ్లి అక్కడి నుంచి బెంగళూరు మార్గంలోకి వెళుతున్నారు. దీనిపై నేషనల్ హైవే అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

11న మండల సమావేశం

గుడుపల్లె: మండల సాధారణ సర్వ సభ్య సమావేశం ఈనెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక శ్రీశక్తి భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపి తెలిపారు. ఈ సమావేశంలో మండల పరిషత్‌కు సంబంధించిన అన్ని అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలన్నారు.

విద్యార్థుల శాతం పెంచాలి


కేజే పురంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

పాలసముద్రం: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల శాతం పెంచాలని ప్రిన్సిపల్ హేమలత అన్నారు. శనివారం బలిజకండ్రిగ, కేజే పురం, వనదుర్గాపురం, పాలస ముద్రం గ్రామాల్లో అధ్యాపకులు పర్యటించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులను చేర్పిస్తే ఉన్నత విద్యను అభ్యసిస్తారన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులే చాలా వరకు ఉన్నత స్థాయిలో ఉన్నారని వివరించారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత పాఠ్య పుస్తకాలు, మౌలిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగానే ప్రభుత్వ కళాశాలల్లో విద్యను అభ్యసిస్తామని తెలిపారు.

వైభవంగా దేవరకొండపై పూజలు



భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండపై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు వైభవంగా సాగాయి. శనివారం ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చనలు చేపట్టారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పలువురు భక్తులు ఉపవాస దీక్షలను ముగించుకున్నారు. కొండపై చెక్కభజనలు, కోలాటాలు, పిల్లనగ్రోవులతో భక్తులు సందడి మొదలైంది.

రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఇదీ పరిస్థితీ..


రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు

కుప్పంరూరల్ : కుప్పం–డీకెపల్లె మార్గంలోని రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్వోబీ) చిన్నపాటి చెరువును తలపిస్తోంది. రెండు రోజులుగా కురిసిన ఓ మోస్తరు వర్షానికే పెద్ద ఎత్తున నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నిర్మాణం చేపట్టిన రెండు సంవత్సరాలుగా ఇదే తరహా సమస్య ఉన్నా, రైల్వే అధికారులు కానీ, ఇటు మున్సిపల్ అధికారులు కానీ పట్టించుకోక పోవడంతో వర్షం కురిసిన ప్రతిసారీ ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఇప్పటికైనా అధికారులు వర్షపునీరు బయటికి వెళ్లేలా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

దాడులకు పాల్పడడం టీడీపీకి తగదు

వి.కోట: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పార్టీ శ్రేణులు ప్రభుత్వ ఆస్తులపై, వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేయడం సబబు కాదని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జవునపల్లెలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను టీడీపీ సానుభూతి పరులు ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యంలో తగవన్నారు. మండలంలో ఎప్పుడూ ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోలేదని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్తులపై, వైఎస్సార్‌సీపీ శ్రేణులపై భౌతిక దాడులు జరుగుతున్నాయని, టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు తమ పార్టీశ్రేణులకు సమన్వయం పాటించేలా పిలుపునివ్వాలన్నారు. తమ ప్రభు త్వం అధికారంలో ఉన్నప్పుడు తాము ఎన్నడూ కక్షపూరిత చర్యలకు పాల్పడ లేదని తెలి పారు. అందరి సమన్వయంతో అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కుప్పంరూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని పరమహంస యోగానంద విద్యాలయ ప్రిన్సిపాల్ ఆజాద్‌హుస్సేన్ అన్నారు. శనివారం శాంతిపురం మండలం, కూతేగానిపల్లె పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. 9,10 తరగతుల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై వక్తృత్వ, వ్యాసరచన, 7, 8 తరగతులకు గ్రీటింగ్ కార్డు మేకింగ్, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. అలాగే నీటి వృథాను అరికట్టాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో మొక్కలు నాటించారు.

లక్ష్మీనరసింహస్వామికి అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి భక్తి ప్రపత్తులతో ఆలయ ప్రధాన అర్చకులు స్వామి వారికి పాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని సుంగదపరిమళాలతో కూడిన వివిధ రకాల పుష్పాలు, తులసీ దళాలతో ఆకర్షణీయంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రాదాలు పంచిపెట్టారు.

ఇంటివద్దే మెరుగైన వైద్యం


వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ అనూష అన్నారు. మండలంలోని నంగమంగళం గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీలత, పవిత్ర, సరిత, వరలక్ష్మి, రూబి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. కల్యాణ వెంకన్న ఊంజల్ సేవ


ఊంజలసేవలో ఉభయ నాంచారులతో స్వామివారు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం దేవదేవేరులు ఊయ్యాల సేవలో భక్తులను అనుగ్రహించారు. వేకువజామున సుప్రభాత సేవతో శ్రీస్వామివారిని మేల్కొలిపి నిత్యపూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదా లను అందుకున్నారు. సాయంత్రం కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చిపై అధిష్ఠింపజేసి ఊరేగింపుగా ఊంజల్ మండపానికి వేంచేపు చేసి ఊయలలో కొలువుదీర్చారు. అనంతరం వేదనాద కచేరీల నడుమ స్వామి,అమ్మవార్లు ఊయలలో సేదతీరుతూ భక్తులను దర్శనమిచ్చారు.

వైభవంగా మహాశివుని రుద్రాభిషేకం


విశేష అలంకరణలో మహాశివుడు

పుత్తూరు: వడమాలపేటలోని భవానీ శంకరస్వామికి శనివారం మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. మహాశివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా వేకువ జామున గణపతి పూజ, గోపూజ, స్వస్తి వాచన, ఏకాదశ రుద్ర కలశస్థాపన నిర్వహించారు. మహాశివుడి మహాలింగానికి వేదమంత్రాల నడుమ పంచామృత అభిషేకం చేశారు. అనంతరం రుద్ర గమకాలు పఠిస్తూ భక్తుల శివనామ స్మరణల మధ్య మహారుద్రాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శివ పార్వతుల ఉత్సవమూర్తులకు పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.